క్లుప్తంగా

సర్పంచ్‌పై పోలీసు దౌర్జన్యం తగదు



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్

పాలసముద్రం: దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన దోషులను వదిలి, పోలీసులు సర్పంచ్‌ని నిర్బంధించడం తగదని, నిజమైన నిందితులను అరెస్టు చేయాలని వైఎస్‌ఆర్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవళంపేటలో సర్పంచ్ గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే ఘటన తర్వాత అప్పట్లో వేసిన శిలాఫలకాన్ని తొలగించడం దారుణమన్నారు. అయితే పోలీసులకు నిందితులెవరో తెలుసునన్నారు. అయితే కూటమి నాయకుల చేతులో కీలుబొమ్మల్లా ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తామన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో ఉభయదారులచే స్వామి వారికి శాస్త్రోక్తంగా సుదర్శన హోమం, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇవే.. వ్యర్థ వ్యయాలు



కాజూరు చెరువు వద్ద పడేసిన వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: నగరంలోని కాజూరు సమీపంలో భవన వ్యర్థాలను రహదారుల పక్కనే పడేస్తున్నారు. చిత్తూరు–బెంగళూరు రోడ్డులోని కాజూరు సమీపంలో ఇప్పటికే రోడ్డు విశాలంగా లేక ఆక్రమణలతో.. కుదించుకుపోయింది. ఈ మధ్యకాలంలో భవన వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను కొందరు చెరువుకు పక్కనే పడేసి వెళ్లిపోతున్నారు. దీని గురించి ఎవరూ అడిగేవారు లేరు. ఇలా కొద్ది రోజులు గడచిన తరువాత వ్యర్థాల తొలగింపునకు రూ.లక్షలు వ్యయం చేసి, యంత్రాలతో వీటిని శుద్ధి చేసినట్లు రికార్డుల్లో కనబరచడం కార్పొరేషన్‌లో రివాజుగా మారింది.

చలో విజయవాడకు తరలిరండి




మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: టీచర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావొస్తున్నా ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించి ప్రస్తుతం అమలు చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. ఉద్యోగ సంఘాలను ఇంత వరకు కనీసం చర్చలకు పిలవకపోవడం అన్యాయమన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి వెంటనే చైర్‌పర్సన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతానికి తగ్గకుండా ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీలో ఎంపికై 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత విధుల్లో చేరిన టీచర్లకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మెమో నంబర్ 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు, టీచర్లు అధిక సంఖ్యలో విచ్చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.30 వేల కోట్ల పెండింగ్ నిధులను దశలవారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలను రూపొందించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు జేఏల్స్‌గా, ఎంఈఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రన్, చిత్తూరు డివిజన్ కన్వీనర్ ఢిల్లీప్రకాష్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వంతెన.. అంతేనా!



లోతట్టు వంతెనపై పారుతున్న కుశస్థలి నది





కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న యువకులు

- కుశస్థలి నదిపై నిర్మాణానికి నోచుకోని హైలెవల్ వంతెన
- వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న వైనం
- ఆదివారం వంతెనపై నీరు పారడంతో కొట్టుకుపోయిన వ్యక్తి
- కాపాడిన స్థానిక యువకులు



గత పాలనలో హైలెవల్ వంతెన నిర్మాణానికి సర్వే చేస్తున్న ఆర్అండ్‌బీ ఇంజినీర్లు (ఫైల్)

నగరి: కుశస్థలి నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో వర్షాలు వచ్చి నదిలో నీరు పారే సమయంలో కీళపట్టు, మేళపట్టు, ముడిపల్లి, రామాపురం, నెత్తం కండ్రిగ, వీకేఆర్ పురం, తడుకుపేట గ్రామాలకు చెందినవారు పడుతున్న అగచాట్లు అన్నీఇన్నీ కావు. వర్షాకాలంలో నది ఉప్పొంగితే లోతట్టు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ మార్గాన్ని రెండు వైపులా మూసివేస్తారు. సాహసం చేసి ఆ మార్గంలో నడిచి వెళ్లిపోదామని ప్రయత్నించిన వారు కొట్టుకుపోవడం వారిని ఆపై కాపాడడం తదితర సంఘటనలు ఇదివరకే చోటుచేసుకున్నాయి. ఇలా కృష్ణాపురం గేటు ఎత్తడంతో కుశస్థలి నదిలో నీటివేగం పెరిగి లోతట్టు వంతెనపై పారింది. ఈ సమయంలో అడవికొత్తూరుకు చెందిన వ్యక్తి కొట్టుకుపోగా స్థానిక యువకులు సాహసం చేసి తాళ్లసాయంతో అతన్ని బయటకు లాగారు. ముఖ్యంగా తమిళనాడు వైపుగా వెళ్లే బస్సులకు ఇదే ప్రధాన మార్గం కావడంతో లోతట్టు వంతెనపై నీళ్లుపారే సమయాల్లో బస్సు ప్రయాణించే మార్గాన్ని మార్చాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం ఇలా పెద్ద ఎత్తున వంతెనపై రోజుల తరబడి నీరు పారిన సమయంలో లోతట్టు వంతెన కూడా కొట్టుకుపోయింది. దీంతో రోజుల తరబడి ఈ మార్గంలో రాకపోకలు ఆగాయి. అప్పటి మంత్రి ఆర్కే రోజా వెంటనే తాత్కాలిక ప్రాతిపదికన రోడ్డును నిర్మించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్య రాకూడదని హైలెవల్ వంతెన నిర్మాణానికి నడుం బిగించారు. ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రిని, ఆర్అండ్‌బి ముఖ్య కార్యదర్శిని కలిసి, సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి నూతనంగా హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రయత్నాలు చేపట్టారు. దీంతో రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన ఇంజినీర్లు వంతెన నిర్మించాల్సిన ఎత్తు, వెడల్పు, దూరం కొలతలు వేసే సర్వేలు చేశారు. దానికి సంబంధించిన అంచనాలు సిద్ధం చేశారు. అవసరమయ్యే నిధులు అంచనా వేయడం తదితర ప్రక్రియలు జరిగాయి. 2024 జనవరి 30వ తేదీన ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఆర్ అండ్‌బీ) మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికి రూ.8.14 కోట్లు మంజూరు చేసి, ఈ టెండర్లు ఆహ్వానించారు. అయితే అంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వంతెన నిర్మాణ అంశం మరుగున పడింది.

గత ఏడాదీ అదే పరిస్థితి

గత ఏడాది నదిలో నీరుపారే సమయంలో లోతట్టు వంతెన కొట్టుకుపోవడంతో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వంతెన వద్దకు విచ్చేసి, పరిశీలించారు. అనంతరం రోడ్లుభవనాల శాఖ అధికారులతో చర్చలు జరిపారు. లోతట్టు వంతెనకు మరమ్మతులు చేపట్టి రోడ్డు నిర్మించడానికి అంచనాలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నదిలో పేరుకుపోయిన పిచ్చిమొక్కల కారణంగా నదినీరు ముందుకు సాగక రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. పిచ్చిమొక్కలు తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. త్వరలో నిధులు కూడా అందిస్తామన్నారు. అయితే ఇప్పటివరకు ఆ పనులు ఏవీ జరగలేదు.

రాకపోకలకు ఇబ్బంది



మా గ్రామంతోపాటు పలు గ్రామాలకు వెళ్లేందుకు కుశస్థలి నదిపై ఉన్న లోతట్టు వంతెనే ప్రధాన మార్గం. అయితే వర్షాలు ఎక్కువగా కురిసి కృష్ణాపురం డ్యామ్ గేట్లు తెరిచే సమయంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ సమయాల్లో ఈ మార్గంలో వెళ్లలేం. సుదూర ప్రాంతంలోని వంతెన పైనుంచే వెళ్లాల్సి ఉంటుంది. గతంలో పలువురు అధికారులు వంతెన నిర్మాణం కోసం సర్వే చేశారు. అయితే ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయాయి.

–రామ్‌రమేష్, ముడిపల్లి గ్రామం

చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది



మాది నెత్తం కండ్రిగ గ్రామం. ప్రతి రోజూ లోతట్టు వంతెన ఉన్న మార్గంలోనే మా గ్రామానికి వెళుతుంటాను. వర్షాకాలం కుశస్థలి నది పొంగి ప్రవహిస్తుండడంతో ఆ సమయాల్లో ఈ మార్గంలో రాలేం. చుట్టూ తిరిగి మరో వంతెనపై నుంచే వెళ్లాలి. గత ఏడాది చేపలు పట్టే ఒక వ్యక్తి కూడా కొట్టుకుపోతే పోలీసులు, స్థానిక యువకులు కాపాడారు. నేడు ఆవు కాలికి లాడం కొట్టడానికి అడవికొత్తూరు నుంచి వచ్చిన వ్యక్తి కొట్టుకుపోయాడు. హైలెవల్ వంతెన నిర్మిస్తే ఈ సమస్య ఉండదు.

–కృష్ణమూర్తి, నత్తంకండ్రిగ

గ్యాంగ్ రేప్ నిందితుల్ని శిక్షించాలి

పుత్తూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన బాలికపై సామూహిక లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్‌ఆర్ సీపీ గిరిజన విభాగం కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా గిరిజనులపై దాడులు జరుగుతున్నాయన్నారు. గిరిజన భూములను సైతం లాక్కోవడం, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహిళలపై మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గిరిజన బాలికపై జరిగిన లైంగికదాడిపై స్పందించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి అనిత సైతం ఈ దుర్ఘటనపై స్పందించకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే గిరిజనులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు.

నేడు వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్తల సమావేశం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్ రాజా స్వగృహంలో వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ సమావేశానికి హాజరు అవుతారని, మండలంలోని నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని శ్రీవిజ్ఞానతేజ స్కూల్‌లో సోమవారం సీఎంసీ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు టి.కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ వైద్య పరీక్షలు ప్రారంభమవుతుందన్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు మహనీయుడు అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- అమాయకులను వదిలి, నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- జీడీనెల్లూరు మండల వైఎస్‌ఆర్ సీపీ నాయకుల డిమాండ్

గంగాధరనెల్లూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళితులకే కాదు అన్ని వర్గాలకు మహనీయుడని వైఎస్‌ఆర్ సీపీ గంగాధరనెల్లూరు మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో దేవళంపేటలో అంబేడ్కరర్ విగ్రహంపై పెట్రోల్ పోసి కాల్చివేసిన దుర్ఘటన సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం దేవళంపేటలో గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో బొమ్మాయిపల్లి సర్పంచ్ చొక్కా గోవిందయ్యపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పగా, నాటి నుండే టీడీపీ నాయకుడు సతీష్ నాయుడు విగ్రహం తొలగించేలా అడ్డంకులు పెడుతూనే ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సర్పంచ్ గోవిందయ్యపై అనేక రకాలుగా అణగదొక్కే చర్యలు చేపట్టారన్నారు. చెక్ పవర్ తొలగించడం, జేసీబీలు ట్రాక్టర్లు ఎక్కడా పని జరగనీయకుండా అడ్డుకోవడం చేశారన్నారు. విగ్రహం కాల్చివేత దుర్ఘటనపై న్యాయం చేయండని ఫిర్యాదు చేసిన వ్యక్తి పైనే కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టడం, కేసును తానే ఒప్పుకోవాలి అంటూ విచారణలో ఇబ్బంది పెట్టడం సబబు కాదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం కాల్చివేసిన వారిని వెంటనే పట్టుకోవాలని, అమాయకులను వదిలి పెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, కడపగుంట పుష్పరాజ్, కొత్రకోన శేఖర్, ఢిల్లీ కుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్‌ఆర్ సీపీ నాయకుల నిరసన

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి కాల్చిన ఘటనను మండల కన్వీనర్ మణి, ఇతర వైఎస్‌ఆర్ సీపీ ఖండించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ విగ్రహానికి నిప్పు పెట్టిన కూటమి నాయకుడు సతీష్‌నాయుడు ఆగడాలను పరిగణనలోకి తీసుకుని, పోలీసులు విచారించాలన్నారు. అలా కాకుండా విగ్రహం పెట్టిన సర్పంచ్ గోవిందయ్యని వేధించడం తగదన్నారు. నిజమైన దోషులను పట్టుకుని శిక్షించాలని తెలిపారు.

అసలు నిందితులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

పాలసముద్రం: అంబేడ్కర్ విగ్రహం పెట్టిన దళిత సర్పంచ్ గోవిందయ్యను పోలీసులు విచారణ పేరుతో వేధించడాన్ని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, ఎంపీటీసీ గోవిందరాజు ఖండించారు. ఆదివారం పాలసముద్రంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చేసిన వారిని కాపాడ్డానికి అమాయక దళితుడిని నిర్బంధించడంపై వారు మండిపడ్డారు. కూటమి పాలనలో దళితులను చిన్నచూపు చూడడం, అవహేళన చేయడం రివాజుగా మారుతోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు అసలు నిందితులను అరెస్టు చేయాలన్నారు. మండల మాజీ కన్వీనర్ సుందరరాజు, పద్మనాధ నాయుడు, రవిరెడ్డి, షణ్ముగరెడ్డి, ప్రకాష్, ప్రేమ్ కుమార్, వేణు, గోపాల్, విష్ణు, ధనపాల్, చలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాకీలు మారినప్పడల్లా ఇదే సమస్య

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ట్రాఫిక్ నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కొత్త అధికారులు ఎవరు వచ్చారో తెలుసుకోవాలంటే చిత్తూరు–వేలూరు రోడ్డులోని ఎంఎస్‌ఆర్ కూడలి వద్ద చూస్తే అర్థమైపోతుంది. ట్రాఫిక్ స్టేషన్‌కు ఎవరైనా కొత్తగా వస్తే చాలు.. తొలుత ఎంఎస్‌ఆర్ కూడలి నుంచి చిత్తూరు నగరంలోకి వచ్చే రోడ్డును మూసేయడం అలవాటుగా మారిపోయింది. కొద్దిరోజుల తరువాత ఇలా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోందని గ్రహించి, ఆపై రోడ్డుకు అడ్డుగా ఉన్న బోర్డులను తీసేసి.. వాహనాలను అనుమతిస్తారు. ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీపై కొత్తగా అధికారి వచ్చినప్పుడంతా ఇదే పరిస్థితి. కిందిస్థాయి ఉద్యోగులు విషయం చెప్పడం లేదో..? ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన లేకో..? తెలియడంలేదు గానీ.. అధికారుల తీరు వల్ల వాహనచోదకులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుకు అడ్డుగా బోర్డులు పెట్టడం వల్ల వాహనాలన్నీ జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్దకు వెళ్లి యూటర్న్ తీసుకోవాలి. ఇక్కడ రెండు ద్విచక్రవాహనాలు వెళ్తే, వెనుకవైపు ఆటో వెళ్లడం కష్టతరంగా మారుతోంది. ఇదే మలుపు వద్ద రావడంతో రెండు వైపులా ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోతున్నాయి.

రాజ్యాంగకర్తకు తీరని అవమానం



మాట్లాడుతున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దళిత ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు జరుగుతున్నాయని వైఎస్‌ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం పుత్తూరు తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృపాలక్ష్మి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల వారికి ఆశాజ్యోతిగా నిలిచిన అంబేడ్కర్ విగ్రహాలను కూల్చడానికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వెదురుకుప్పం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి అగ్రవర్ణ దురహంకారంతో నిప్పు పెట్టి కాల్చేశారన్నారు. విగ్రహం ఏర్పాటు చేసి దళిత సర్పంచ్‌ను విచారణ పేరుతో వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల పోలింగ్ రోజు అదే గ్రామానికి చెందిన సతీష్‌నాయుడు తనను కులం పేరుతో దూషించారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని వివాదాలు రేపుతున్న సతీష్‌నాయుడే ఆ విగ్రహాన్ని కాల్చేశారని ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారని తెలిపారు. ఇదంతా పట్టించుకోకుండా నిందితుడ్ని వదిలి దళిత సర్పంచ్‌ను అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోతున్నాయని ఆరోపించారు. కనీసం తనకు సోషల్ మీడియాలో అకౌంట్ లేకున్నా తనపై కేసు నమోదు చేశారని, ఇప్పటి వరకు రుజువులు చూపించ లేక పోతున్నారని విమర్శలు గుప్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన విషయంపై దేశ వ్యాప్తంగా అట్టుడికిపోతున్నా స్థానిక పోలీస్ అధికారులు మాత్రం అమాయకులను ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కుట్రలను ప్రజలు గ్రహించాలని సూచించారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక పూజలు






స్వామీజీలను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు, మూలకోనలో హోమం

పుత్తూరు: నేసనూరు పంచాయతీ పరిధిలోని మూలకోనలో వెలసి ఉన్న పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజులపాటు హోమాలు, ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తిరువణ్ణామలైకి చెందిన నాగదేవ దత్తగిరిస్వామి, ప్రజ్ఞానంద స్వామీజీల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాది కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చివరిరోజైన ఆదివారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం స్వామీజీలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం స్వామీజీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉభయదారులు కె.వెంకటేశులు, కె.దొరస్వామిరెడ్డి, ఎం.రామచంద్రారెడ్డి, రాంబత్తయ్య, గ్రామ సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి, గ్రామపెద్దలు పి.సుబ్రమణ్యంరెడ్డి, జి.వెంకటరత్నం, తిరుమలరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



సత్యవేడు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం సత్యవేడులో దుర్గా దేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా సర్వమంగళాదేవి ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీర్చిన కనకదుర్గా మాతకు నవరాత్రుల సందర్భంగా వివిధ రూపాల్లో కొలువుదీర్చి పూజలు చేపట్టారు. ఉత్సవాలు ముగియడంతో ఆదివారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధి, కృష్ణయ్యశెట్టి వీధి, గంగమ్మ వీధుల్లో ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పసుపు నీటి కలశాలను తలపై ఉంచుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం

సత్యవేడు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం సత్యవేడులో దుర్గా దేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా సర్వమంగళాదేవి ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీర్చిన కనకదుర్గా మాతకు నవరాత్రుల సందర్భంగా వివిధ రూపాల్లో కొలువుదీర్చి పూజలు చేపట్టారు. ఉత్సవాలు ముగియడంతో ఆదివారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధి, కృష్ణయ్యశెట్టి వీధి, గంగమ్మ వీధుల్లో ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పసుపు నీటి కలశాలను తలపై ఉంచుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.



తవణంపల్లె: ద్రౌపదీదేవికి, పాండవుల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



తపస్సు మానును అధిరోహిస్తున్న అర్జునుడిని తిలకించడానికి విచ్చేసిన భక్తజనం

వైభవంగా అర్జున తపస్మాన్

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం సాయంత్రం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో 120వ సంవత్సర మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సంత గేటులో అర్జున తపస్సును భక్తితో నిర్వహించారు. ద్రౌపదీదేవి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు, తపస్సు మానుకు భక్తులు విశేషంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నాడు. అనంతరం కళాకారుడు మణికంఠ అర్జునుడి వేషధారణలో తపస్సు మానును అధిరోహించారు. పైనుంచి విసిరిన విభూది, నిమ్మపండ్లు, బొరుగులు, బిల్వ ఆకులు, అరటి పండ్ల కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం కోసం మహిళలు తడిదుస్తులతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.